క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

దాబాగార్డెన్స్: నగరానికి చెందిన ఆడారి కనకరాజు కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 విరాళం అందజేశారు. గురువారం ఈవో కె. శిరీషకు ఆ విరాళాన్ని నగదు రూపంలో అందించారు. వారికి అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యురాలు సత్యరూపవాణి, ఏఈవో వెంపలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ ఇన్‌చార్జి ఏడీకి పదోన్నతి



పీఎస్ అప్పారావు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న పీఎస్ అప్పారావుకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి ఇస్తూ రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ వి.రామిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయనను విజయనగరం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమించారు. దీంతో ఆయన ఇక్కడ రిలీవ్ అయ్యారు. 1986లో వైద్య ఆరోగ్యశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఆయన విధుల్లో చేరారు. 2005లో సీనియర్ అసిస్టెంట్‌గా కేజీహెచ్, 2019లో ప్రాంతీయ కంటి ఆస్పత్రి కార్యాలయంలో ఆఫీసు సూపరింటెండెంట్‌గా పని చేశారు. 2020 జనవరిలో ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ (ఎఫ్ఏసీ) హోదాలో పని చేశారు.


నూతన గ్రంథం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు

మహారాణిపేట : ఆంధ్రాలో అజ్ఞాత స్వాతంత్ర్య వీరులు-వీర వనితలు పుస్తకాన్ని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ సీనియర్ నాయకుడు జీవీఎల్ నరసింహారావు గురువారం ఆవిష్కరించారు. తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ 76వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని ఏయూ తెలుగు విభాగం పరిశోధక విద్యార్థి దేవరకొండ ప్రవీణ్‌కుమార్ ఈ పుస్తకాన్ని రచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఏపీ రాష్ట్ర వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణలో పట్టభద్రుల లెక్క ఇదీ



విశాఖ దక్షిణ నియోజకవర్గం

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి 9,372 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మొత్తం 14 బూత్‌లకు గాను బూత్ నంబర్ 249లో 948 మంది, 250లో 518, 251లో 679 మంది, 252లో 516, 253లో 1022, 254 బూత్‌లో 883, 255లో 823, 256 బూత్‌లో 1296, 257లో 949, 258లో 217, 259లో 290, 260లో 680, 261లో 247 మంది ఓటర్లుండగా బూత్ నంబర్ 262లో 304 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఇరుకు దారిలో భారీ వాహనాలు

- ఇబ్బంది పడుతున్న స్థానికులు, పాదచారులు



వాహనాలతో కిక్కిరిసిపోయిన కళా ఆస్పత్రి రోడ్డు

సీతమ్మధార : ద్వారకానగర్‌లోని కళా ఆస్పత్రి రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఈ ప్రాంతంలో పలు పాఠశాలలు, కాలేజీలతో పాటు ప్రైవేట్ కార్యాలయాలు, గొడౌన్లు ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు, ఉద్యోగులతో కిక్కిరిసిపోతుంటుంది. ఈ నేపథ్యంలో భారీ వాహనాలు గనుక ఈ రోడ్డులోకి వస్తే ఇక పరిస్థితి చెప్పనవసరం లేదు. ఆ వాహనానికి అటు ఇటు ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోతుంటుంది. ఈ ప్రాంతంలో పలు వ్యాపార గొడౌన్లు ఉండటంతో భారీ వాహనాలు ఇక్కడి ఇరుకు రోడ్డులోకి ప్రవేశిస్తుంటాయి. దీంతో స్థానికులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 10 గంటల తరువాత ఈ రోడ్డులోకి భారీ వాహనాలకు అనుమతి లేదు. అయినప్పటికీ అలాంటి వాహనాలు వస్తుండడంతో సమస్య ఎదురవుతోంది. ద్వారకానగర్‌లోని 1,2,3,4,5 లేన్‌లలో భారీ వాహనాల ప్రవేశంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అదే విధంగా ఇక్కడి కొన్ని విద్యా సంస్థలు, కోచింగ్ సెంటర్లు, ఇతర కార్యాలయాలకు చెందిన వాహనాలను చాలా వరకు రోడ్డు పైనే నిలిపివేస్తుండటం వల్ల కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గురువారం మధ్యాహ్నం భారీ వాహనం ఒకటి రోడ్డుపై నిలిపివేయడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ ప్రాంతంలో తరచూ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుండటం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

శానిటరీ కార్యాలయం ఆకస్మిక తనిఖీ



పారిశుధ్య కార్మికుల హాజరును పరిశీలిస్తున్న జెడ్సీ శివప్రసాదరావు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-4 జోనల్ కమిషనర్ శివప్రసాదరావు గురువారం మధ్యాహ్నం 29వ వార్డు దండుబజార్ వద్ద ఉన్న వార్డు శానిటరీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికుల హాజరు పట్టీ పరిశీలించారు. వార్డు పరిధిలో పని చేస్తున్న కార్మికులు ఎంత మంది? ఎక్కడెక్కడ పని చేస్తున్నారు? వారు చేస్తున్న పని.. తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రతి కార్మికుడు విధుల్లో అలసత్వం వహించకుండా పని చేయాలని సూచించారు. వార్డు పరిధిలో ఎక్కడా పారిశుధ్యానికి సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవల్సిన బాధ్యత కార్మికులదేనని పేర్కొన్నారు. అలాగే యూజర్ చార్జీలు కూడా బకాయిలు లేకుండా త్వరితగతిన వసూలు చేయాలని ఆదేశించారు.

చిరస్మరణీయురాలు ఆదిలక్ష్మి



ఆదిలక్ష్మి (ఫైల్)

దాబాగార్డెన్స్: గీతా ప్రచార సమితి సేవకురాలు పి. ఆదిలక్ష్మి సంస్మరణ సభ గురువారం సంస్థ కార్యాలయంలో జరిగింది. సమితి ప్రతినిధి వై. కృష్ణమూర్తి పాల్గొని మాట్లాడారు. భగవద్గీత, విష్ణు సహస్రనామం, లలితా సహస్రనామం ప్రచారంలో ఆదిలక్ష్మి చేసిన ఆధ్యాత్మిక సేవలు చిరస్మరణీయమన్నారు. ధార్మిక సేవకు ఆమె ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా గీతాప్రచార సమితి సభ్యులు భగవద్గీత శ్లోకాలు సామూహికంగా పారాయణ చేశారు. సంస్మరణ సభలో గీతా ప్రచార సమితి ప్రతినిధులు ఎంపీ రాజశేఖర్, పి. జగన్మోహనరావు, జీవీఆర్ ప్రసాద్, లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

చదువుల్లో రాణిస్తే పుష్కలంగా ఉపాధి



ఏవీఎన్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న అతిథులు

దాబాగార్డెన్స్: చదువుల్లో రాణిస్తే ఉద్యోగాలు పుష్కలంగా ఉన్నాయని డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, రీసోర్స్‌పర్సన్ జి. శ్రీనివాసరావు తెలిపారు. కామర్స్ విభాగం ఆధ్వర్యంలో వర్చువల్ ఇంటర్న్‌షిప్ అండ్ కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టుపై నగరంలోని ఏవీఎన్ కళాశాలలో గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఏ, బీకాం, బీఎస్సీ చదువుకున్న వారికి కూడా ఎన్నో ఉద్యోగాలున్నాయని, పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రత్యామ్నాయ విద్య, భావ వ్యక్తీకరణ అవసరమన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు సంబంధించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కృష్ణకుమారి, లైబ్రరీ సైన్స్ హెచ్‌వోడీ స్వరాజ్యలక్ష్మి, కామర్స్ లెక్చరర్ డాక్టర్ ప్రసన్నకుమార్, ఇంగ్లీషు హెచ్‌వోడీ పైడి రజని తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: నియోజకవర్గ పరిధిలో గల ఇద్దరు గుండె జబ్బు పేషెంట్లకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆర్థిక సాయం అందజేశారు. ఆశీల్‌మెట్ట సమీపాన అశోక్‌నగర్‌లో గల ఎమ్మెల్యే కార్యాలయంలో 27వ వార్డు అశోక్‌నగర్‌కు చెందిన ఈతలపాక ప్రసాద్‌కు రూ.2,500, దొండపర్తికి చెందిన ముద్దు పైడమ్మకు రూ.2,500 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పీతల వాసు, బోని దేవా, చంటి, కుమార్, పేషెంట్ల బంధువులు పాల్గొన్నారు.

సృష్టికి మూలం స్త్రీ



బీసీ సంఘ మహిళల్ని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

దాబాగార్డెన్స్: స్త్రీ లేకపోతే సృష్టి లేదని ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీసీ సంఘ కార్యాలయంలో గురువారం పలువురు బీసీ మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా మణులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. బీసీ కులాల సంఘం ప్రతినిధి కట్టా మల్లేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నాయకులు పొన్నాడ మోహన్‌రావు, గడ్డప్ప, న్యాయవాది లక్ష్మీదుర్గా, తుమ్మిడి బాబీ, రాంబాబు, రమేష్, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

తారాస్థాయికి ప్రచారం



వివాహ వేడుకలో పెండ్లి కుమారుడిని ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



వైఎస్సార్ పార్కులో ప్రచారం చేస్తున్న బొడ్డేటి ప్రసాద్, శ్రీను తదితరులు



మాట్లాడుతున్న కొండా రాజీవ్ గాంధీ

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ప్రచారం తారాస్థాయికి చేరింది. మరో మూడు రోజులే గడువు ఉండడంతో అభ్యర్థులు గెలుపు కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

ఎమ్మెల్యే వాసుపల్లి ప్రచారం..

ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం 29,32,38 వార్డుల్లో విస్తృత ప్రచారం చేపట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు కోరుతూ ఆయా వార్డుల్లో ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, ప్రైవేట్ విద్యాసంస్థలు, హాస్పిటళ్లు, వైఎస్సార్ అర్బన్‌క్లినిక్‌లు, మెడికల్ షాపులు, ఆలయాలతో పాటు విద్యావంతులైన గ్రాడ్యుయేట్ల ఇళ్లకు వెళ్లి ఓటు అభ్యర్థించారు. 38వ వార్డులో విశ్వబ్రాహ్మిణ్ కమ్యూనిటీ హాల్లో జరుగుతున్న వివాహంలో పెండ్లి కుమారుడిని ఓటు వేయమని అభ్యర్థించారు. వార్డు పరిధి బురుజుపేట, ఘోషాసుపత్రి, పప్పులవీధి, సోల్జర్స్‌పేట, గాంధీబొమ్మ, శివాలయం వీధి, టౌన్‌హాల్, బుక్కావీధి, మట్టా వెంకటప్పవీధిలో ప్రచారం చేపట్టారు. 29వ వార్డులో దండుబజార్, భుజంగరావుపేట, రామజోగిపేట, జిల్లా పరిషత్, శ్రీరంగపురం, ఏయూ లేడీస్ హాస్టల్, కృష్ణుని కోవెల తదితర ప్రాంతాల్లో, 32వ వార్డులో అల్లిపురం గాంధీబొమ్మ, నేరెళ్లకోనేరు, పోలీస్ క్వార్టర్స్, బ్రహ్మం సైకిల్‌షాప్ తదితర ప్రాంతాల్లో ఆయా వార్డుల నాయకులతో కలిసి ప్రచారం చేశారు.

31వ వార్డులో..

సీతంరాజు సుధాకర్ గెలుపు కోరుతూ 31వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు బత్తిన నవీన్‌కుమార్ గురువారం వార్డు పరిధి డాబాగార్డెన్స్‌లోని గొల్లలపాలెం, శెట్టిబలిజ సంఘం ఏరియా, విశ్వనాథ్ రోడ్డులో ప్రచారం చేపట్టారు.

29వ వార్డులో..

29వ వార్డు కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు దిబ్బలపాలెం, ప్రకాశరావుపేట, చందకవీధి తదితర ప్రాంతాల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

అల్లిపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ గురువారం వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ దరి వైఎస్సార్ పార్కులో ప్రచారం చేపట్టారు.

33వ వార్డులో...

వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ ఆధ్వర్యంలో గురువారం అల్లిపురం మోడల్ స్కూలు, గౌరీవీధి ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, వార్డు సీనియర్ నాయకుడు బొడ్డేటి ప్రసాద్, ఆడారి వెంకట మహేష్, అయ్యప్పరెడ్డి, కొడమంచిలి ప్రసాద్, పిల్లి శివ, గంగా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో రమాప్రభ ప్రచారం

అల్లిపురం: పీడీఎఫ్ బలపరిచిన డాక్టర్ కోరెడ్ల రమాప్రభ జిల్లా కోర్టులో ప్రచారం చేశారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని న్యాయవాదులను అభ్యర్థించారు. ఈ ప్రచారంలో ఆమెతో పాటు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ప్రతినిధులు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెంలో..

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీ, సెబాస్టియన్ ప్రాంతంలో వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా గురువారం ప్రచారం చేశారు. సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

విశాఖ విద్య: ఎమ్మెల్సీగా సీతంరాజు సుధాకర్ గెలుపుతో పట్టభద్రులకు మేలు జరగనుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సీతంరాజు గెలుపు కోరుతూ గురువారం ప్రచారం నిర్వహించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా సీతంరాజు సుధాకర్ పోటీ చేస్తున్నందున మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఉత్తరాంధ్రలోని నిరుద్యోగులకు అండగా నిలిచి, ఉద్యోగ అవకాశాలు దక్కేలా సీతంరాజు కృషి చేస్తారనే నమ్మకం ఉందన్నారు. సీం జగన్ ఆశీస్సులతో సీతంరాజు పోటీ చేస్తున్నందున, ఇక్కడి నుంచి విజయం సాధిస్తే మేలు జరుగుతుందన్నారు. పట్టభద్రులు అత్యధిక మెజారిటీతో సీతంరాజును గెలిపించాలన్నారు.

గైస్‌లో మహిళల రక్షణకు ప్రత్యేక విభాగం

ఇంటర్నల్ కంప్లెయింట్స్ సెల్ ప్రారంభం

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లో వినూత్న కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా అంతర్గత ఫిర్యాదుల విభాగాన్ని(ఐసీసీ) ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏర్పాట్లు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. కాలేజీలో విద్యనభ్యసిస్తున్న బాలికలు, మహిళా అధ్యాపకులు తమకు సంబంధించిన సమస్యలపై ఈ విభాగంలో ఫిర్యాదు చేయవచ్చు. మహిళలు తమ సమస్యలు చర్చించుకునేందుకు ఐసీసీకి ప్రత్యేక గదిని కేటాయించారు. పెట్రోకెమికల్స్ సీనియర్ లెక్చరర్ ఎం.బోధమ్మ ఈ ఫిర్యాదుల విభాగానికి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. మహిళలను వేధించే వారిపై ఇక్కడ ఫిర్యాదు చేయవచ్చు. నేరుగా లేదా 'సబల' యాప్ నంబర్ 63026 66254కు ఫోన్ చేసి ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బోధమ్మ మహిళా లెక్చరర్లు, విద్యార్థినులతో సమావేశమయ్యారు. ఫిర్యాదులు చేసే విధానాన్ని ఆమె వివరించారు. వాటిని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారు. అవసరమైతే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటారు. మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నందుకు ప్రిన్సిపాల్ వెంకటరమణకు అధ్యాపకురాళ్లు, విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు.

ముస్లిం, మైనార్టీల అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



మాక్ పోల్ ద్వారా ఓటు వేసే విధానాన్ని వివరిస్తున్న వైవీ సుబ్బారెడ్డి తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

అల్లిపురం: ముస్లిం, మైనార్టీల అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు, కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ అధ్యక్షతన గురువారం రాత్రి వన్‌టౌన్ షాదీఖానాలో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మాక్ బ్యాలెట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు అవలంబించాల్సిన విధానాన్ని నమూనా బ్యాలెట్ సహకారంతో వివరించారు. పార్టీ శ్రేణులు ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, మాజీ శాసనసభ్యుడు ఎస్ఏ రెహ్మాన్, వక్ఫ్ బోర్డ్ మెంబర్ అఫ్రోజ్, సబిత, కార్పొరేటర్లు నారాయణ, చెన్నా జానకిరామ్, కొండమ్మ, పోలిపల్లి జ్యోతి, ఉమామహేశ్వరరావు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసి పూజ



భక్తుల పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలో 28 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

శ్రీరామ నవమి ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో చర్చిస్తున్న ఈవో శిరీష, ధర్మకర్తల మండలి సభ్యులు

దాబాగార్డెన్స్: నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేటలో గల అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం (కనకమహాలక్ష్మి దేవస్థానం దత్తత దేవాలయం)లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం పేర్కొన్నారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని గురువారం ధర్మకర్తల మండలి సమావేశమైంది. ఈ నెల 30న శ్రీరామనవమి సందర్భంగా స్వామి మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు, అందుకు తగ్గట్టు ఏర్పాట్లపై సమీక్షించారు. పెండాల్స్ ఏర్పాటు, పూలు, విద్యుత్ అలంకరణ, భక్తులకు అన్నదానం, పెయింటింగ్, తాటాకుల పందిరి వంటి ఏర్పాట్లపై చర్చించి ఆమోదించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు సత్యరూపవాణి, ఎం. ధనలత, బి. వెంకటరత్నం, బి. అనురాధ, ఎస్. సతీష్, వి. మారుతీప్రసాద్, ఎన్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్. సురేష్, ఎక్స్ అఫిషియో సభ్యుడు కొడమంచిలి శ్రీనివాస్‌శర్మ, ప్రత్యేక ఆహ్వానితుడు జి. ప్రకాష్, ఆలయ ఏఈవో వెంపలి రాంబాబు, కార్యనిర్వహక ఇంజనీర్ సీహెచ్‌వీ రమణ, పి. రామారావు, కేఎస్ఎన్ మూర్తి, కె. పద్మజ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ పెన్షనర్ల వినతి



డీఆర్‌వో శ్రీనివాసమూర్తికి వినతిపత్రం సమర్పిస్తున్న పెన్షనర్లు

మహారాణిపేట : అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తికి గురువారం వినతిపత్రం సమర్పించారు. 2018 నుంచి బకాయి ఉన్న డీఆర్, ఎరియర్లు సత్వరం చెల్లించాలని,11వ పీఆర్‌సీలో ఉన్న లోపాల సవరణకు అనామలీస్ కమిటీ ఏర్పాటు చేయాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డీడీ ప్రసాదరావు కోరారు. ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నుంచి నూతన వేతన సవరణలు అమలు చేయవలసి ఉన్నందున తక్షణం 12వ పే కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. హెల్త్‌కార్డులపై అన్ని ఆస్పత్రుల్లోను క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ వర్తింపజేయాలని డీఆర్‌వోకు, ట్రెజరీ శాఖ ఏటీవోకు వినతపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి, ఎ.సాయిబాబా, డీఎస్ఎన్ మూర్తి, టీవీ రమణమూర్తి, విశ్వేశ్వరరావు, బి.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అమర్‌నాథ్‌కు సన్మానం



మంత్రి అమర్‌నాథ్‌ను సన్మానిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

అక్కిరెడ్డిపాలెం: ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఆడారి ఆనంద్ కుమార్ రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను 68వ వార్డు మిందిలో గురువారం కలిశారు. తనకు పదవి రావడానికి సహకరించినందుకు అమర్‌కు శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. విశాఖ డెయిరీ డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు 24 మంది



ఎంపిక పోటీలు ప్రారంభిస్తున్న మోహన్‌కృష్ణ

మధురవాడ: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలకు విశాఖ జిల్లా తరఫున పాల్గొనే మహిళ, పురుష జట్లకు 24 మంది ఎంపికయ్యారు. మధురవాడ శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్‌లో ఎంపిక పోటీలను గురువారం మధ్యాహ్నం సంస్థ చైర్మన్ ఎమ్.మోహన్‌కృష్ణ ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారుల మధ్య ఉత్సాహంగా పోటీలు జరిగాయి. వీరిలో 12 మంది చొప్పున పురుష, మహిళ జట్లను అబ్జర్వర్, ఎన్ఐఎస్ కోచ్ కె.చిట్టిబాబు పర్యవేక్షణలో ఎన్ఐఎస్ కోచ్‌లు కె.కావ్య, ఐ.చరణ్ ఎంపిక చేశారు. 9వ రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మెన్ అండ్ వుమెన్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు కాకినాడలో లేడీస్ క్లబ్ ద్రోణ అకాడమీలో శుక్రవారం నుంచి నిర్వహించనున్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ కార్యదర్శి పి.త్రినాథ్ తెలిపారు.

రాష్ట్ర జట్లు ఇవే : రాష్ట్ర స్థాయి పోటీలకు మహిళల జట్టుకి కె.లిఖిత, బి.రాజేశ్వరి, ఎస్.లహరి, డి.శృతి ప్రియ, పి.ప్రసన్న, సీహెచ్.సాయిప్రభ, ఇ.జ్ఞానేశ్వరి, టి.లిఖిత, ఎ.జాహ్నవి, ఎమ్.జ్యోత్స్న, ఎస్.జ్యోతి, ఎస్.పూజిత ఎంపికయ్యారు. పురుషుల జట్టుకి ఎ.సంపత్, ఆకాశ్ వర్ధన్, ఎమ్.జోయల్ యశ్వంత్ కుమార్, జి.రుత్విక్, వి.దిలీప్ కుమార్, కె.కార్తీక్, కె.శివశంకర్, ఎ.జీవన్, వి.పూర్ణచంద్ర ప్రసాద్, ఎస్.రాజేష్, ఎస్.సత్యనారాయణ, కె.మనోజ్‌కుమార్ ఎంపికయ్యారు.